కథ

# యుద్ధానంతరం




'చార్వాకా మిత్రమా' అని పలవరించాడు మృత్యు ముఖంలో సుయోధనుడు. సుయోధనుడు నెత్తుటి మడుగులో దొర్లుతున్నాడు. పాండవులు అతన్ని నిర్దయగా తన్నుతున్నారు. విజయగర్వంతో గెంతుతున్నారు. చార్వాకుని గురించి పలవరిస్తూనే సుయోధనుడు మరణించాడు.

సుయోధనుని మిత్రుడు చార్వాకుడు యుద్ధ విముఖుడు. శాంతి కాముకుడు. యీ సోదరుల ఆస్తి తగాదా అమాయక ప్రజల చావుకొచ్చిందని చార్వాకుడు అనేవాడు. యెందుకీ యుద్ధం జరుగుతోందో, యెవరి అధికార భోగలాలసత కోసమో తెలీని అమాయక ప్రజలు యుద్ధంలో ప్రాణాల్ని తృణప్రాయంగా త్యజిస్తారు. ప్రభువులు విజయమో వీరస్వర్గమో అని ప్రజల్ని మందల్లా దూకిస్తారు. భస్మమైన శరీరానికి స్వర్గనరకాలెక్కడివి? అవును చార్వాకుడు యుద్ధాన్ని పూర్తిగా వ్యతిరేకించాడు.

సుయోధనుడన్నాడు "వాళ్లడిగినట్లు ఆ మహానగరాలు ఐదూ పాండవులకి యిచ్చేస్తే, ప్రస్తుతానికి యుద్ధం ఆగిపోతుంది. నిజమే, కాని బలహీనమైపోయిన సామ్రాజ్యాన్ని యెలా యేలగలను? ముందైనా శత్రువుల్నుంచి ముప్పు తప్పదు. పురోహిత వర్గపు అతితెలివి సంధి రూపంలో కృష్ణుని నోట్లోంచి యిలా వూడిపడింది".

చార్వాకుడు ఆలోచనలో పడ్డాడు. సుయోధనుడు తనకి యెప్పట్నుంచో మిత్రుడు ఆప్తుడు. ఔను లోకం మెచ్చనప్పటికీ యెన్నో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకొన్నాడు. కర్ణుడు విలువిద్యలో ప్రావీణ్యాన్ని నిరూపించుకొని, పరీక్షలో విజయం పొందడానికి అతని కులంలేనితనం అడ్డంకిగా నిలిచింది, దొంగ రాజగురువుల దృష్టిలో. వెంటనే సుయోధనుడు కర్ణున్ని అంగరాజ్యానికి పట్టాభిషిక్తున్ని చేసి అతనికొక సామాజిక హోదా కల్పించాడు.

"సెభాష్ సుయోధనా నువ్వే రారాజువి సుక్షత్రియులమని కులగర్వంతో విర్రవీగే రాజుల కుంభస్థలాల్ని పగలగొట్టావ్. పురోహితుల కంకణాల్ని వ్రయ్యలు చేశావ్"

## రాణి శివశంకర్

ఆనందంతో సుయోధనుణ్ణి కౌగిలించుకున్నాడు చార్వాకుడు.

చార్వాకుని మనస్సులో సుయోధనుడి స్మృతులు ముప్పిరిగొంటున్నాయి. అతని హత్య వార్తనింకా జీర్ణించుకోలేకపోతున్నాడు. పరుగు పరుగున మడుగువొడ్డుకి జేరి సుయోధనుని శిరస్సుని వొళ్ళో జేర్చుకొని హృదయ విదారకంగా విలపించాడు.

"మిత్రమా సుయోధనా నన్ను నా అన్న కర్ణున్ని అన్నివేళలా ఆదుకొన్నది నువ్వే. మాటిమాటికీ నీకులమేమిటని అన్నిటికీ మమ్మల్ని పురోహితులు దూరం చేశారు. ఆ క్లిష్ట సమయంలో నువ్వే నన్ను ఆదుకొన్నావు. హృదయం గల రారాజువి నువ్వు చివరికి రక్తపాతానికి విసిగిపోయి ప్రశాంతి కోరి మడుగులో విశ్రాంతి తీసుకొంటున్న నిన్ను వొక్కణ్ణేచేసి చుట్టుముట్టి చంపేశారు. శత్రువులు దొంగదెబ్బ తీశారు, శత్రుశేషం వుండకూడదని. ఔను నువ్వు బతికున్నంతకాలం నిజాలు బతికుంటాయ్. కులతత్వమూ, కుత్సితాలూ, కుట్రలూ, అశ్వత్థామా హతఃకుంజరః అనే అసత్య ప్రలాపాలూ అన్నీ మరుగున పడిపోకుండా నిలిచుంటాయ్. ధర్మరాజుగారి అధర్మం బట్టబయలౌతుంది. అందుకే నిరాయుధుణ్ణి వొంటరివాణ్ణి చేసి చంపేశారు. వాళ్లు శిలాఫలకాల మీద వీరోచిత యుద్ధంలో నిన్ను హతమార్చామని రాసుకొంటారు.

పాండవుల్లారా మీ శత్రుశేషం అంతరించలేదు నేనున్నాను నిజాలన్నిట్నీ ప్రజలకి చెప్తాను సుయోధన చరితం రచిస్తా"

** ** **

హస్తినాపుర వీధుల్లో వొక స్త్రీ అశ్వాన్ని దౌడు తీయిస్తోంది. యుద్ధానంతర పరిస్థితులు సమాజాన్ని అల్లకల్లోలం చేశాయి. అనేక వేలమంది పురుషులు మరణించారు. ఎందరో వికలాంగులయ్యారు. వారి స్త్రీల పరిస్థితి ఏమిటి? యుద్ధం వల్ల ఏర్పడిన కల్లోల పరిస్థితిలో స్త్రీలు గతి తప్పుతారని, వర్ణ సాంకర్యం ఏర్పడుతుందని అర్జునుడు కృష్ణుడితో గగ్గోలుపెట్టాడు. శ్రీకృష్ణుడు యుద్ధం క్షత్రియధర్మం, సందేహాలు విడిచి ముందుకు దూకమన్నాడు.

కాని యుద్ధానంతరం పరమ వీరపత్నుల వీరమాతల గతియేమిటి? వారు జీవితాంతం ఆ బిరుదుల్ని మోస్తూ భర్తల శౌర్య ధైర్య పరాక్రమాల్ని స్మరించుకొంటూ పరదాల చాటున దాక్కొంటారా? యిప్పటికే గర్భవతులైన స్త్రీలకి తప్ప మళ్లీ వీరమాతల విధి నిర్వర్తించే అవకాశం లేదా? మరో పురుషుడివల్ల వీరమాతలయ్యే అవకాశాన్ని సమాజం రాజగురువులూ ఆమోదించగలరా?

సరే కొందరు స్త్రీలు సతీసహగమనం చేశారు. మరి కొందరు బలవంతంగా నిప్పుల్లోకి నెట్టబడ్డారు. పూజించడానికి కొత్త దేవతలు లభించారని ప్రభువులతో సహా అందరూ సంతోషించారు. మరి బతికున్న స్త్రీల సంగతేంటి? వీరస్వర్గాన్ని అలంకరించిన వీరాధివీరులు అదృశ్య ఖడ్గాలతో తమ స్త్రీల శీలానికి చంచల మనస్సులకి దేహాలకి కాపలా కాయలేరు కదా!

** ** **

వొక క్షత్రియ స్త్రీ హస్తినాపుర వీధుల్లో అశ్వాన్ని దౌడు తీయిస్తోంది. ఆ స్త్రీ పరదా ధరించలేదు. బాగా చెమట ఫట్టింది ఆమెకి.

ఆ దృశ్యాన్ని ద్రౌపది కిటికీలోంచి చూసింది- ఉత్తేజకరమైన ఉత్సాహవంతమైన దృశ్యం.

విరటుడి కొలువులో సైరంధ్రిగా మారువేషంలో జీవించినపుడు తాను పురవీధుల్లోకి వొంటరిగా అడుగుపెట్టాల్సివచ్చింది. ఆనాడు విశాల ప్రపంచపు గాలిని హాయిగా పీల్చుకొంది. రకరకాల కులవృత్తుల్ని పురుషుల్తోపాటు వుత్సాహంగా చేసే స్త్రీలని చూసి అబ్బురపడింది. అంతఃపురంలో చిలకలా బంధించబడిన తనకి, బైట విశాల ప్రపంచంలో కష్టజీవులైన ఆడవారి స్వతంత్ర జీవితానికి గల తేడాని ఆనాడే గ్రహించింది.

భాషకంటె మోసకారి మరొకటిలేదు. స్వయంవరమట స్వయంవరం. తన తండ్రి మత్స్యయంత్రాన్ని కొట్టాలనే పరీక్షపెట్టాడు. తనపేర జరిగిన పందెంతో తనకి సంబంధమేమిటి? స్వయం నిర్ణయానికి తనకేనాడూ అవకాశం కలగలేదు. పురుష ప్రపంచం తీవ్రంగా హింసించింది. భర్తలే తన జీవితంతో జూదమాడారు. తన పరాధీన జీవితాన్ని గురించి స్మృతులు ద్రౌపదిని వుక్కిరిబిక్కిరి చేశాయి.

** ** **

ఆ అశ్వారూఢయైన స్త్రీ గుర్రాన్ని వొక కుటీరం దగ్గర ఆపింది. పరమ నిరాడంబర సౌందర్యంతో వొప్పుతున్న ఆ గుడిసెలో చార్వాకుడు నివసిస్తాడు.

ఆ స్త్రీ భర్తని యుద్ధంలో కోల్పోయిన దురదృష్టవంతురాలు (అదృష్టవంతురాలా?) ఆ యువతి సుందర శరీరం సూర్యకాంతిని పీల్చుకొని వెన్నెల్ని వెదజల్లుతోంది.

ఆమె కురులలో చీకటి రాత్రులు తలదాచుకొంటాయి. దొంగ ఆత్మవాదం స్త్రీ శరీరాన్ని అణచివేసే స్వార్థపురోహిత కల్పనని, పాతివ్రత్యం కూడా అంతేనని చార్వాకుని బోధనలవల్ల గుర్తెరిగి అతని వక్షస్థలంలో ఆత్మీయంగా తలదాచుకొంది. శరీరమే సర్వస్వమన్న ఆ వాస్తవిక తాత్వికుడి బిగికౌగిలిలో తన శరీరం వినూత్న అనుభూతుల్తో వొక పువ్వులా విచ్చుకొంది.

ఏ సంకోచాలూ దొంగ బోధనలూ న్యూనాధిక్య భావనలూ లేని ఆ చార్వాక మహర్షితో సంగమించిన రేయి నిజమైన తొలిరేయి. శరీరానికొక భాషవుందని, అది ముళ్లనీ రాళ్లనీ అన్ని సంకోచాల్నీ నీతుల్నీ అన్నిట్నీ నెట్టుకుపోయే సెలయేరని, నిలవ నీటిగుంట కాదని అతని సహవాసంలో గ్రహించి పరవశించింది. శరీరమే ఆత్మ అన్నాడు చార్వాకుడు. ఆత్మనుంచి శరీరాన్ని విముక్తి చేశాడు.

** ** **

"ఆ స్త్రీ యెక్కడికి వెళ్తోంది?"

గుర్రంమీద ఆత్మ విశ్వాసంతో ధైర్యంతో దూసుకుపోయిన స్త్రీలోని స్వేచ్ఛా సౌందర్యమే గుర్తుకొస్తోంది ద్రౌపదికి. చెలికత్తెలెంత వారించినా వినకుండా ద్రౌపది గ్రామీణురాలి వేషంలో హస్తిన వీధుల్లో విహరిస్తోంది.

యుద్ధానంతరం పరిస్థితులు చాలా మారిపోయాయని ద్రౌపది గుర్తించింది. స్త్రీలు గుంపులుగుంపులుగా హుషారుగా తిరుగుతున్నారు. యుద్ధంలో వికలాంగులైన పురుషులు కూడా కనిపిస్తున్నారు. వొక రచ్చబండ మీద గుమిగూడిన స్త్రీలు. అక్కడేం జరుగుతోంది?

భర్తల్ని కోల్పోయిన యుద్ధానంతర స్త్రీలకి ధైర్యం నూరిపోస్తున్నాడు చార్వాకుడు.

"మీ భర్తలే మీ జీవితం కాదు. యుద్ధం వల్ల ధ్వంసమై కళాకాంతులు కోల్పోయిన హస్తినని మీరు తిరిగి సుందరంగా తీర్చిదిద్దవచ్చు. శిల్పాలెన్నో ధ్వంసమయ్యాయి. మహాభవంతులు నేలమట్టమయ్యాయి. వాటిని మీరు పునర్నిర్మించవచ్చు. వీరమాతల వీరపత్నుల బిరుదుల్ని మోసుకొంటూ తిరగక్కర్లేదు. సతీసహగమనాలక్కర్లేదు. విధవరాండ్రమని గుండు గీయించుకొని మూల కూర్చోడమో, ఆశ్రమాల్లో చేరడమో చేయక్కర్లేదు. ఇవన్నీ స్వార్థ పురోహితుల కుట్రపూరిత ఆలోచనలు యుద్ధ విధ్వంసం కన్న పురోహిత వర్గం ప్రమాదకరమైనది. వారి బుర్రల్లోనే సోదరుల మధ్య చిచ్చుపెట్టే భయంకర యుద్ధాలు పుడ్తున్నాయి పుడ్తాయి."

"మేం అబలలం యేం చెయ్యగలం?"

"ఔను మీరు స్త్రీలే! మీకు చేతుల్లేవా హృదయంలేదా మెదడు లేదా మరణానంతరం మరేదీలేదు. ఇప్పటికైనా మీ ఇష్టమైన పురుషుల్ని వరించండి; కులభేదాల్ని పూర్తిగా విడిచిపెట్టండి. జీవితం విషమని బోధించే పురోహితుల వేదాంతాన్ని నమ్మకండి. ముల్లుల్ని తొలగించుకొని చేపల్ని ఇష్టంగా ఆరగించినట్లు మనిషి కష్టాల్ని అడ్డంకుల్ని తెలివిగా తొలగించుకొంటూ ఆనందంగా జీవించాలి. పురోహితుల్లా పరాన్నభుక్కుల్లా జీవించకండి. శ్రమించండి. జీవించండి. సుఖించండి"

చార్వాకుని మాటలు కలకలం రేపాయి. గుమిగూడిన స్త్రీలు చర్చల్లోకి దిగారు. ద్రౌపది ఆశ్చర్యపోయింది. అతడెవరు? అతని మాటలు పురోహితుల, క్షత్రియుల అభిప్రాయాలకంటె భిన్నమైనవి. పరుగున వెళ్లి ద్రౌపది అడిగింది.

"మీ పేరేమిటి ఆర్యపుత్రా?"

"నేను ఆర్యపుత్రుణ్ణి కాదు. సూతపుత్రుణ్ణి. నాపేరు చార్వాకుడు"

"కర్ణుడి సోదరుడు చార్వాకుడంటే నువ్వేనా?"

"ఔను. నీ పేరేమిటి?"

"ద్రౌపది"

ద్రౌపది ఆ పేరు చార్వాకునికి సుపరిచితం. తన అన్న కర్ణుడు కూడా స్వయంవరానికి వెళ్లాడు. సూతపుత్రుడికి అర్హతలేదని తిరస్కరించారు.

తన అన్న కర్ణుడి జీవితం. విచిత్రమైన విషాదం. పుట్టుకతో క్షత్రియుడు. అనుభవాలన్నీ సూతులవి, దుర్భరమైనవి. కర్ణుడు దొరికిన తర్వాతే తన తల్లి రాధ గర్భంలో ప్రవేశించాడు. అన్నగారి స్మృతుల్తో చార్వాకుడికి కన్నీళ్లు. ద్రౌపదికి తానెందుకు విలపిస్తున్నాడో చెప్పాడు.

"నీ సోదరుడు కర్ణుడు, నీ ప్రభువు దుర్యోధనుడు మరణించినందుకు విలపిస్తున్నావేకాని నాకెదురైన పరాభవాలెన్నో..."

"ద్రౌపదీ! నీ విషయంలో అందరూ అన్యాయంగానే ప్రవర్తించారు. పురోహితులు స్త్రీని పురుష ఆస్తిగా ప్రచారం చెయ్యడంవల్లే ఇదంతా జరిగింది. పురోహితులు క్షత్రియుల బుర్రల్ని చెడగొట్టారు. స్త్రీలమీద దాడిని శత్రు ఆస్తులపై దాడిగా భావించేలా చేశారు. నేను, వికర్ణుడు, సుయోధనుడు ఎంత వారించినా సుశాసనుడు మామాట పెడచెవినబెట్టి నీ భర్తల్ని మించిపోయేలా నిన్ను అవమానించాడు. దానికి నిష్కృతి లేదు.

కాని స్త్రీలకి, శూద్రులకి, ప్రజలందరికీ కంటకప్రాయులైన పురోహితుల చెప్పుచేతల్లోకి వెళ్లిపోవడం నీ

ద్రౌపదికి అసలు యుద్ధానికి కారణమేమిటో తెలుసు. సుయోధనుడు చూపిన సర్వసమాన భావన, కర్ణ పట్టాభిషేకం నిమ్నజాతుల్లో గిరిజనుల్లో ఎన్నో ఆశలు రేపాయి. గిరిజనులు తమ రాజ్యాలకి స్వతంత్ర ప్రతిపత్తి అతనివల్లే కలుగుతుందని నమ్మారు



భర్తల ఘోర తప్పిదం. అందువల్లే ఘోర యుద్ధం సంభవించింది. సూతపుత్రుడు కర్ణున్ని నీ ప్రియ భర్త అర్జునుడు మోసపూరితంగా చంపేశాడు. ఎందరో సూత పుత్రులు, పంచములు, ఆంధ్రులు మొదలైన తెగల గిరిజనులు కులం లేని వాళ్లందరూ సుయోధన పక్షాన నిలిచిపోరాడారు. ఎందువల్ల వొక్కసారి ఆలోచించు ద్రౌపదీ! ఇందరు అభాగ్యులు, వంచితులు, బాధితులు, సుయోధనపాలన యెందువల్ల కోరుకున్నారు? హు... మహారాణి, మహారాజపుత్రి, మహామహ సాధ్వి విసిరేస్తే పెంచుకొన్న అనాథ కర్ణున్ని సుయోధనుడు రాజుని చేస్తే, నా తల్లి ఆనందంతో కల్లుతాగి నాట్యం చేసింది. యుద్ధంలో అందర్నీ కోల్పోయిన సుయోధన సార్వభౌముడు తన చివరి రోజుల్లో మా సూతులవాడలోనే మా అందరిలో వొకడిగా బతికాడు. యుద్ధ విముఖుడైన సుయోధనుణ్ణి పౌరుషం లేదా అంటూ రెచ్చగొట్టి చుట్టుముట్టి దొమ్మీగా చంపేశారు నీ భర్తలు. మీ క్షత్రియ పురోహిత వర్గమంతా అతన్ని దుర్యోధనుడని పేరుని వక్రీకరించి నిందించనీ. మా సూత జాతికి అతడు సుయోధనుడు. ఆరాధ్యదైవం."

ద్రౌపదికి అసలు యుద్ధానికి కారణమేమిటో తెలుసు. సుయోధనుడు చూపిన సర్వసమాన భావన, కర్ణ పట్టాభిషేకం నిమ్నజాతుల్లో గిరిజనుల్లో ఎన్నో ఆశలు రేపాయి. గిరిజనులు తమ రాజ్యాలకి స్వతంత్ర ప్రతిపత్తి అతనివల్లే కలుగుతుందని నమ్మారు.

** ** **

స్వాహా మంత్రాల మధ్య వొక అపస్వరం. "ఆపండి మంత్రాలు"

"ఎవరది పవిత్ర పురోహితుల్ని వేదమంత్రోచ్చారణ ఆపమంటున్న పాషండుడు"

చార్వాకుడు ధర్మరాజు కూర్చున్న హోమగుండం దగ్గరికి వెళ్లాడు. బ్రాహ్మణ వేషం ధరించడంవల్ల భటుల నిశిత దృష్టిని తప్పించుకొని అక్కడికి వెళ్లగలిగాడు.

"ధర్మరాజా యెందుకీ యాగం?"

"ఏమిటా సందేహం? మేం యుద్ధంలో విజయం సాధించాం. మహా సామ్రాజ్యానికి చక్రవర్తుల మయ్యాం. శాంతికోసం ఈ రాజసూయ యాగం"

"మహారాజా నిజంగా మీరు విజయం పొందారా? విజయం అంటే ఏమిటి?

"దుర్యోధనుణ్ణి కూడా చంపేశాం. శత్రుశేషం లేదు. ఇంక సందేహమేమిటి?

"ధర్మరాజా నీ సోదరులు గురువులు ఎందరో బంధుమిత్రులు అమాయక ప్రజలు మరణించారు. వారి చావుకేకలు గుర్తుకువచ్చి నీ నిద్ర చెదరగొట్టడం లేదా? కుటిల తంత్రాలతో కులతత్వంతో సాగిన ఈ యుద్ధంలో యెవరు నిజమైన విజేతలు? నిన్ను యెప్పటికీ వెంటాడే పీడకలల్ని మోసుకొచ్చినది విజయమేనా?"

ధర్మరాజు హృదయంలోంచి వేదన పెల్లుబికి వచ్చింది. ద్రౌపదిని కౌగిలించుకొని విలపించాడు.

"ఔను రోజూ నిద్రపట్టడంలేదు. రణభూమిలో అవయవాలు తెగి రక్తపు ధారలలో దొర్లుతున్న సోదరులు, గురువులు, అమాయక ప్రజలు నాకళ్లముందే ఇంకా మెదుల్తున్నట్లుంది. భయమూ వేదనా జుగుప్సా నా హృదయాన్ని ముక్కలు చేస్తున్నాయి. నేనీ విజయోత్సవాన్ని మనః పూర్వకంగా ఆహ్వానించలేకపోతున్నాను. పురోహితులు మనశ్శాంతి కల్గుతుందని చెప్పడంవల్ల యజ్ఞం ప్రారంభించా"

"మహారాజా! మీకు మనశ్శాంతి కలుగుతుందో లేదో దేవుడెరుగు. పురోహితులకి మాత్రం లక్షలాది సువర్ణ నాణాలు, ఆభరణాలు, మాన్యాలు దక్కుతాయి. వారు మరింత విలాసవంతంగా జీవిస్తారు. పైకి ఆధ్యాత్మిక కబుర్లు చెప్తారు. యుద్ధ కల్లోలంలో చాలా పశుసంపద నశించింది. ఈ యాగం కోసం వేలాది పశువులు చంపివేయబడి పాడీపంటా అంతరించిపోతుంది. ఇది మరో కల్లోలానికి యుద్ధ పరిస్థితికి దారితీస్తుంది. ఇదో విషవలయం."

వొక పురోహితుడు లేచి-

"నువ్వెవరు నీ కులమేమిటి గోత్రమేమిటి?"

"నేను చార్వాకుణ్ణి. సూత పుత్రుణ్ణి."

"అసురుడిలా మారువేషంలో యెందు కొచ్చావ్?"

"అసురులకి కాదు దేవతలకే మారువేషాలు, దొంగ వేషాలు అలవాటు. ఇంద్రుడి సంగతి తెలీదా? నేనీ వేషం వెయ్యకపోతే నన్నిక్కడికి రానియ్యరు. ఈ మోసం ఇలాగే కొనసాగిపోతుంది"

పురోహితుడు ధర్మరాజుతో ఆగ్రహస్వరంతో "ధర్మరాజా! విన్నారా సూతపుత్రుడికి ధర్మసూక్ష్మాలెలా తెలుస్తాయి? భూసురుల మాట జవదాటితే, యేం జరుగుతుందో మీకు తెల్సు. మా పరశురాముడు క్షత్రియుల్ని గొడ్డలితో నరికి పారెయ్యడం మరిచిపోయారా? మమ్మల్ని పూజించనందువల్లే దుర్యోధనుడు సర్వనాశనమయ్యాడు. చంపేవాడు చంపించేవాడు ఆ పరాత్పరుడే. మీరు నిమిత్తమాత్రంగా నరికి, ఈ భూమ్మీద భోగభాగ్యాలు అనుభవిస్తారు. వర్ణాశ్రమ ధర్మాన్ని నిలుపుతారు. అదే మీ ధర్మం"

"అదే అధర్మం" గర్జించాడు చార్వాకుడు.

మరుక్షణం హోమగుండం భగ్గుమంది.

హాహాకారాలు స్వాహాకారాల్లో లయమయ్యాయి. ఆ అసురుడు చార్వాకుడు బ్రాహ్మణుల ఆగ్రహదృష్టికి భస్మమయ్యాడు.

"ప్రపంచం యెంత క్రూరమైనది?" అని విలపించింది ద్రౌపది.